https://trinetnews.com/

# ట్రైనెట్ న్యూస్

నిజం • బాధ్యత • నిబద్ధత

తెలుగు దిన పత్రిక

తాజా తెలుగు వార్తలు

ప్రతి 3 గంటలకు

98497 67747 | 9494184136

7 AM TO 10 AM

సంపుటి: 01 / సంచిక:22 / పేజీలు :02 / వేల:2/రూ / ఎడిటర్: వెంకటేశ్వర్లు రాపోలు / సోమవారం, సెప్టెంబర్ 07,2026



## అమెరికాలోనూ 'సర్'..

### ఓటర్ జాబితాల సమీక్షకు సిద్ధమైన డొనాల్డ్ ట్రంప్ సర్కార్

వాషింగ్టన్ : ,ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 7

భారత్‌లోని 'సర్' (ప్రత్యేక సమగ్ర సమీక్ష) లాగా అమెరికాలో ఓటర్ జాబితాలను నిశితంగా పరిశీలించడాన్ని ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రారంభించారు. ఇందుకోసం సుమారు రూ.125 కోట్ల నిధులను విడుదల చేశారు. ఈ ప్రక్రియలో భాగంగా ఓటర్ జాబితాలను పరిశీలించి జాతీయ ఓటర్ డాటా బేస్‌ను సిద్ధం చేస్తారు. ఈ ప్రక్రియలో అమెరికాలో నివసిస్తున్న 26 లక్షల మంది భారత సంతతి ఓటర్లలో 10 లక్షల మందిని ఓటర్ల జాబితా నుంచి తొలగించే ముప్పు ఉందని అంచనా వేస్తున్నారు.నవంబర్‌లో జరిగే మధ్యంతర ఎన్నికల్లోపు ఈ ప్రక్రియను పూర్తి చేయాలని అమెరికా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకొన్నది. ఈ ప్రక్రియ నిర్వహణను ఇమ్మిగ్రేషన్, కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ)కి ట్రంప్ అప్పగించారు. ఈ ప్రక్రియలో 50 రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాను పరిశీలించి, అప్‌డేట్ చేస్తారు. ఓటర్ల సమాచారాన్ని వివిధ ప్రభుత్వ రికార్డులతో సరి చూస్తారు. ఓటర్ల జాబితాలను కంప్యూటర్లు ఇమ్మిగ్రేషన్, ఇతర రికార్డులతో సరి చూస్తాయి. ఒక పేరు లేదా సమాచారం రికార్డులతో సరిపోలకపోతే, ఆ ఓటర్ వివరాలను పునఃతనిఖీ చేస్తారు. అలాంటి వాళ్ల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించే ప్రమాదముంది.

#### భారతీయులపైనే ఎక్కువ ప్రభావం ఎందుకు?

న్యూయార్క్, న్యూజెర్సీ, కాలిఫోర్నియా, టెక్సాస్ లాంటి రాష్ట్రాల్లో భారత సంతతి ఓటర్లు, వారి రాజకీయ ప్రభావం చెప్పుకోదగ్గ ప్రాముఖ్యతను కలిగి ఉంది. ఓటర్ల వెరిఫికేషన్, నమోదు ప్రక్రియ నిబంధనలు ప్రతి రాష్ట్రానికీ వేర్వేరుగా ఉన్నాయి. అయితే తాజా ప్రక్రియలో రికార్డులను పరిశీలిస్తుండటంతో భారత సంతతి ఓటర్లు కూడా స్క్రూటినీ చేయబడతారు. భారత సంతతి ఓటర్ల ఓటింగ్ సరళిని కూడా తాజా ప్రక్రియలో పర్యవేక్షించవచ్చని తెలుస్తున్నది. అయితే ఎంత మంది పేర్లను వాస్తవంగా తొలగిస్తారనేది ప్రక్రియ పూర్తయిన తర్వాతే తెలుస్తుంది. మరోవైపు ఓటర్ గుర్తింపు కార్డును దేశవ్యాప్తంగా అమలు చేయాలని ట్రంప్ సర్కార్ భావిస్తున్నది. అమెరికన్ ఓటర్ అర్హత చట్టం ప్రతిపాదిత బిల్లు ద్వారా ఓటర్ల రిజిస్ట్రేషన్, ఓటింగ్ నిబంధనలను కఠినం చేయాలని యోచిస్తున్నది.

## సర్పంచ్‌లకు మంత్రి సీతక్క గుడ్ న్యూస్..

# త్వరలో కొత్త బిల్లు!



గ్రామ నిధులు నేరుగా సర్పంచ్‌లకే ఇచ్చేలా కొత్త బిల్లు ప్రవేశపెడుతున్నామన్న మంత్రి సీతక్క

ఉప సర్పంచ్‌ల చెక్ పవర్ విధానంలో మార్పులు

ఒత్తిళ్లను తట్టుకుని దృఢంగా ఉండాలని సర్పంచ్‌లకు సూచన

,ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 7

తెలంగాణలోని సర్పంచ్‌లకు పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క తీపికబురు అందించారు. గ్రామాభివృద్ధికి సంబంధించిన నిధులు నేరుగా సర్పంచులకే అందేలా త్వరలోనే అసెంబ్లీలో నూతన బిల్లును ప్రవేశపెట్టనున్నట్లు ఆమె ప్రకటించారు. ఈ మార్పు ద్వారా గ్రామాల్లో అభివృద్ధి పనులు మరింత వేగవంతం అవుతాయని ఆమె హామీ ఇచ్చారు.హైదరాబాద్ గచ్చిబౌలిలోని బ్రహ్మకుమారీస్ శాంతి సరోవర్‌లో ఆదివారం 'సమర్థవంతమైన నాయకత్వం ద్వారా గ్రామ ప్రగతి' అనే అంశంపై సర్పంచుల కోసం నిర్వహించిన శిక్షణా కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో ఉప సర్పంచులకు చెక్ పవర్ కల్పిస్తూ తీసుకువచ్చిన చట్టం వల్ల కొన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. ఈ సమస్యను ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని, నిధుల విషయంలో ఎదురవుతున్న అవరోధాల వల్ల అభివృద్ధి పనులు ఆగకూడదన్నదే ప్రభుత్వ ఉద్దేశమని ఆమె స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచులను ఉద్దేశించి మంత్రి పలు సూచనలు చేశారు. నాయకులుగా విమర్శలను, ఒత్తిళ్లను తట్టుకుని మానసికంగా దృఢంగా ఉండాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో కేవలం మౌలిక వసతులు కల్పించడమే కాకుండా, ప్రజల్లో నైతిక విలువలను పెంపొందించడంపై కూడా దృష్టి సారించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన తొమ్మిది రకాల ఆదర్శ గ్రామ సూత్రాలను పాటించి, గ్రామాలను ప్రగతి పథంలో నడిపించాలని ఆమె సూచించారు.

## డ్రగ్స్ కేసులో ఈజిప్టు టీవీ యాంకర్‌కు మరణశిక్ష



,ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 7

డ్రగ్స్ కేసులో ఈజిప్ట్ టీవీ ప్రెజెంటర్ సారా ఖలీఫాకు మరణశిక్ష పడింది. ఆమెతో పాటు మరో 11 మంది నిందితులకు కూడా మరణశిక్ష విధిస్తూ ఈజిప్టు కోర్టు తీర్పు ఇచ్చింది. ఈ కేసులో మరో తొమ్మిది మందికి జీవిత ఖైదు విధించగా.. ఏడుగురిని నిర్దోషులుగా కోర్టు ప్రకటించింది. భారీ స్థాయిలో మాదకద్రవ్యాల తయారీ, అక్రమ రవాణా చేస్తున్నట్లు రుజువు కావడంతో ఈ మేరకు తీర్పు వెలువరించింది.39 ఏళ్ల సారా ఖలీఫా ఈజిప్టులో టెలివిజన్ ప్రెజెంటర్‌గా గుర్తింపు పొందారు. భద్రత, నేరాలకు సంబంధించిన అంశాలపై ప్రసారమయ్యే 'మిషన్ ఇంపాజిబుల్' అనే కార్యక్రమానికి ఆమె యాంకర్‌గా వ్యవహరించారు. అంతేకాకుండా కాస్మెటిక్ సర్జరీ క్లినిక్‌తో పాటు పార్టీలు, ఈవెంట్లను నిర్వహించే ప్రొడక్షన్ కంపెనీని కూడా ఆమె నిర్వహిస్తున్నట్లు ఈజిప్టు మీడియా కథనాలు పేర్కొన్నాయి.

# బీఆర్ఎస్ భేటీలో మహిపాల్‌రెడ్డి..

## ఎర్రవల్లి సమావేశంలో అనూహ్య పరిణామం!

అసెంబ్లీలో అనుసరించాల్సిన వ్యూహాలపై ఎమ్మెల్యేలకు కేసీఆర్ దిశానిర్దేశం

వ్యక్తిగత దూషణలకు వెళ్లకుండా ప్రజా సమస్యలే అజెండాగా పోరాడాలని సూచన

రాష్ట్రంలో 'థర్డ్ క్లాస్' పాలన సాగుతోందని విమర్శ

లక్ష మందితో కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శిస్తామని ప్రకటన

సమావేశానికి కాంగ్రెస్‌లో చేరిన పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి హాజరు





,ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 7

శాసనసభ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రతిపక్ష బీఆర్ఎస్ వ్యూహాలకు పదును పెట్టింది. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు అస్త్రశస్త్రాలతో సిద్ధం కావాలని పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు తమ శాసనసభ్యులకు దిశానిర్దేశం చేశారు. ఆదివారం సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని తన వ్యవసాయ క్షేత్రంలో బీఆర్ఎస్ శాసనసభాపక్ష (బీఆర్ఎస్ఎల్పీ) సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రజా సమస్యలే అజెండాగా ప్రభుత్వాన్ని నిలదీయాలని, అసెంబ్లీని సమరానికి వేదికగా మార్చాలని ఆయన పిలుపునిచ్చారు.

#### సీఎం భాషపై తీవ్ర అభ్యంతరం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వాడుతున్న భాషపై కేసీఆర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. "ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి బూతులు మాట్లాడుతుంటే, అలాంటి వ్యక్తితో మేం చర్చకు రావాలా? ఆయన భాష మార్చుకోవాలి. పాలన చేతకాకనే వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారు" అని కేసీఆర్ ఘాటుగా విమర్శించారు. అధికార పక్షం ఎన్ని వ్యక్తిగత విమర్శలు చేసినా, వాటిని పట్టించుకోవద్దని, ప్రజా సమస్యల నుంచి దృష్టి మరల్చే ప్రయత్నాలను తిప్పికొట్టాలని ఎమ్మెల్యేలకు సూచించారు. సభాపతి వైఖరి పక్షపాతంగా ఉంటే, దానిని కూడా సభలోనే ఎండగట్టాలని స్పష్టం చేశారు.

#### ఇది 'తెలంగాణ ఫాలింగ్'

కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై కేసీఆర్ నిప్పులు చెరిగారు. "ఇది తెలంగాణ రైజింగ్ కాదు, తెలంగాణ ఫాలింగ్. రాష్ట్రంలో మూడో తరగతి పాలన నడుస్తోంది. వంద రోజుల్లోనే ప్రజల ఆశలను వమ్ము చేశారు. తిరిగి అధికారంలోకి రాలేమని తెలిసి, రాష్ట్రాన్ని అడ్డగోలుగా దోచుకుంటున్నారు" అని ఆయన ఆరోపించారు. ముఖ్యంగా కృష్ణా, గోదావరి జలాల విషయంలో రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు.

#### లక్ష మందితో ప్రాజెక్టుల సందర్శన

కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుల విషయంలో ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా కుట్ర పన్నుతోందని కేసీఆర్ ఆరోపించారు. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని, కుట్రలను ప్రజల ముందు ఉంచేందుకు త్వరలోనే లక్ష మంది రైతులు, కార్యకర్తలతో కలిసి ఈ ప్రాజెక్టులను సందర్శిస్తామని ఆయన సంచలన ప్రకటన చేశారు. సుమారు 20 ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని అసెంబ్లీలో ఇరుకున పెట్టేందుకు బీఆర్ఎస్ పక్కా వ్యూహరచన చేసినట్లు తెలుస్తోంది.

#### భేటీలో కాంగ్రెస్ ఎమ్మెల్యే

ఈ సమావేశంలో ఒక అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఇటీవలే కాంగ్రెస్ పార్టీలో చేరిన పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఈ బీఆర్ఎస్ఎల్పీ భేటీకి హాజరుకావడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఆయన రాకతో తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు తెరలేచినట్లయింది.



### పన్నులు వసూలు చేయడం పవన్‌కు తెలుసు:

## పేపర్ మిల్లుపై పురందేశ్వరి కీలక వ్యాఖ్యలు

పేపర్ మిల్లు వ్యవహారంపై స్పందించిన ఎంపీ పురందేశ్వరి

పన్ను బకాయిలు మంత్రి పవన్ వసూలు చేస్తారన్న విశ్వాసం

యాజమాన్యాలకు సామాజిక బాధ్యత ఉండాలని హితవు

నిబంధనలు ఉల్లంఘిస్తే సహించేది లేదని స్పష్టీకరణ

స్థానిక ఎన్నికల్లో కూటమి సమన్వయంతో ముందుకెళ్తుందని వెల్లడి

,ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 7

రాజమహేంద్రవరం పేపర్ మిల్లు వ్యవహారంపై భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి కీలక వ్యాఖ్యలు చేశారు. పారిశ్రామికాభివృద్ధి రాష్ట్ర పురోగతికి అవసరమే అయినప్పటికీ, యాజమాన్యాలు సామాజిక బాధ్యతను విస్మరించడం సరికాదని ఆమె అభిప్రాయపడ్డారు. ఆదివారం రాజమహేంద్రవరంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు.పేపర్ మిల్లు యాజమాన్యం కాలుష్య నివారణ చర్యలను గాలికి వదిలేసిందని పురందేశ్వరి విమర్శించారు. పరిశ్రమలు ఏర్పాటు చేసిన తర్వాత నిబంధనలను ఉల్లంఘిస్తామంటే అంగీకరించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. పేపర్ మిల్లు నుంచి రావాల్సిన పన్ను బకాయిలు, జరిమానాలను ఏ విధంగా రాబట్టాలో సంబంధిత మంత్రి పవన్ కల్యాణ్‌కు పూర్తిస్థాయిలో అవగాహన ఉందని ఆమె పేర్కొన్నారు.ఇదే క్రమంలో పార్టీ భవిష్యత్తు కార్యాచరణను కూడా ఆమె వివరించారు. మంగళవారం రాజమహేంద్రవరం అర్బన్ పరిధిలోని వంద ప్రాంతాల్లో ఏకకాలంలో పార్టీ పతాకాలను ఆవిష్కరిస్తామని, అనంతరం కంబాలచెరువు వద్ద భారీ బహిరంగ సభను నిర్వహిస్తామని తెలిపారు. అలాగే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టినరోజైన సెప్టెంబర్ 17 నుంచి నెల రోజుల పాటు విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు.త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీలు పూర్తి సమన్వయంతో ముందుకు సాగుతాయని పురందేశ్వరి స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇప్పటికే మూడు పార్టీల నేతలతో చర్చించారని ఆమె గుర్తుచేశారు. రాజమహేంద్రవరం కార్పొరేషన్ స్థానాన్ని బీజేపీకి కేటాయిస్తారన్న ప్రచారంపై స్పందిస్తూ.. 'కేటాయిస్తే మంచిదే కదా' అని వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజుతో పాటు ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# ఆటోవాలా.. పోరుబాట..

## కాంగ్రెస్ ప్రభుత్వ 'అబద్ధాల హామీల'పై రణనినాదం

## బీఆర్ఎస్ సమరభేరిలో భాగస్వామ్యమైన డ్రైవరన్నలు

## నగరవ్యాప్తంగా ర్యాలీలు..హోరెత్తిన నిరసనలు

**కాంగ్రెస్ ప్రభుత్వ 'అబద్ధాల హామీల'పై ఆటోవాలా గర్జించాడు. ఉచిత బస్సు ప్రయాణం కారణంగా ఉపాధి కోల్పోయి వీధిన పడ్డామని, ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకోకుండా.. సర్కార్ దగా చేసిందంటూ.. ఆటో డ్రైవర్లు కదంతొక్కారు. వెయ్యి రోజుల కాంగ్రెస్ విఫల పాలనపై బీఆర్ఎస్ చేపట్టిన పోరుబాటలో భాగస్వాములయ్యారు. గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా ఆదివారం భారీ ర్యాలీలు తీశారు.ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో జరిగిన ఈ సమరభేరిలో 'ఆటోవాలా' గర్జనతో గ్రేటర్ వీధులు దద్దరిల్లాయి. కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, లేనిపక్షంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు హెచ్చరించారు.**

-- సిటీబ్యూరో,ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 7

కుత్బుల్లాపూర్‌లో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ఆధ్వర్యంలో సుచిత్ర చౌరస్తా నుంచి జీడిమెట్ల చౌరస్తాలోని గాంధీ విగ్రహం వరకు వందలాది ఆటో కార్మికులతో భారీ ర్యాలీ తీశారు. ఉప్పల్ నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో మల్లాపూర్ ఎలిఫెంట్ చౌరస్తా నుంచి హబ్సిగూడ వరకు ఆటో కార్మికులతో నిరసన ర్యాలీ సాగింది.తాజా వార్తలు చదవండి
శాంతి భద్రతలను పరిరక్షించాలని, తీవ్రమవుతున్న ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తూ మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ శ్రేణులు, ఆటో డ్రైవర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.
కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో ఆల్విన్ కాలనీ డివిజన్‌లో బీఆర్ఎస్ శ్రేణులు, ఆటో డ్రైవర్లు భారీ ఎత్తున నిరసన ర్యాలీ నిర్వహించారు. సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పిలుపు మేరకు అమీర్ పేట డివిజన్‌లో కాంగ్రెస్ బాకీ కార్డుల ప్రదర్శన చేపట్టారు.రాంగోపాల్ పేట, బన్సీలాల్ పేట డివిజన్లలోని బస్తీ దవాఖానల్లో పర్యటించి స్థానిక సమస్యలు తెలుసుకున్న అనంతరం ఆటో కార్మికులతో కలిసి నిరసన ప్రదర్శన నిర్వహించారు. మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ వైఫల్యాలపై నిరసన ర్యాలీలు చేపట్టారు.వాజ్‌పేయినగర్ రైల్వే గేట్ నుంచి సఫిల్‌గూడ, ఆనంద్‌భాగ్ చౌరస్తా, మలాజిగిరి చౌరస్తా మీదుగా మీర్జల్‌గూడ చౌరస్తా వరకు హోరెత్తేలా ర్యాలీ నిర్వహించారు. సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ ఆదేశాలతో వారాసిగూడ చౌరస్తా నుంచి సీతాఫల్‌మండి, చిలకలగూడ, పార్సిగుట్ట మీ దుగా ద్విచక్రవాహన, ఆటో ర్యాలీ చేపట్టారు. ఇందులో మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.కంటోన్మెంట్‌లో బీఆర్ఎస్ నేతలు మన్నె క్రిశాంక్ , గజ్జెల నగేశ్, నివేదిత, టీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు మద్దతుగా కార్ఖానా అంబేదర్ చౌరస్తా నుంచి మారేడ్ పల్లి వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి స్వయంగా ఆటో నడుపుతూ చైతన్యపురి బాబు కాంప్లెక్స్ నుంచి చైతన్యపురి క్రాస్ రోడ్డు వరకు ఆటో కార్మికుల మద్దతుతో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు.కాంగ్రెస్ సర్కార్ వెంటనే ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, లేనిపక్షంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని బీఆర్ఎస్ నేతలు స్పష్టం చేశారు. బీఆర్ఎస్ యువనేత ముఠా జయసింహ ఆధ్వర్యంలో ఎడ్ల హరిబాబు, ఎంఎం శ్రీనివాసరావు, బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని నిరసన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను పూర్తిగా ముంచిందని, ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు.

**ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడుతాం**

**ఆటో కార్మికుల ర్యాలీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల హెచ్చరిక**

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని మేడ్చల్, మల్కాజిగిరి, కూకట్‌పల్లి, ఉప్పల్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల్లో ఆటో కార్మికుల ర్యాలీల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హెచ్చరించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో జరిగిన ఆటో ర్యాలీలో ఆటో కార్మికులకు బాకీ పడ్డ రూ. 36 వేలను ఎప్పుడు చెల్లిస్తారని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ, వివేకానంద్ ప్రభుత్వాన్ని నిలదీశారు.తాజా వార్తలు చదవండిమల్కాజిగిరి నియోజకవర్గంలో జరిగిన ర్యాలీలో ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలకు అనేక హామీలు ఇచ్చి మోసం చేసిందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి విమర్శించారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో జరిగిన నిరసన కార్యక్రమంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మండిపడ్డారు. ఉప్పల్ నియోజకవర్గంలో జరిగిన ఆటో ర్యాలీలో ప్రజా సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం చేస్తామని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హెచ్చరించారు.



# హైదరాబాద్ మెట్రో, ఆర్టీసీ బస్సులకు

# ఉమ్మడి పాస్ జారీకి ఆదేశం





**- నెలవారీ, రోజువారీ పాస్‌లు అందుబాటులోకి తేవాలని సీఎస్ సూచన**

**- పాతబస్తీ మెట్రో, ఎలివేటెడ్ కారిడార్ పనులు వేగవంతం చేయాలని ఆదేశం**

**- బేగంపేట నుంచి ప్యారడైజ్ వరకు మెట్రోలో ప్రయాణించిన సీఎస్ సంజయ్ జాజు**

**- ప్రాజెక్టులకు సీఎం రేవంత్ రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని వెల్లడి**

,ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 7

నగర ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్‌లో మెట్రో రైలు, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేందుకు వీలుగా ఒకే కామన్ పాస్‌ను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా నెలవారీ, రోజువారీ పాస్‌లను జారీ చేయాలని ఆయన స్పష్టం చేశారు.ఆదివారం రసూల్‌పురాలోని మెట్రో రైల్ భవన్‌లో హెచ్ఎంఆర్ఎల్, ఆర్టీసీ, విద్యుత్, మెట్రో వాటర్ వర్క్స్ అధికారులతో ఆయన ఉన్నతస్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఉమ్మడి పాస్ జారీకి సాంకేతికంగా సిద్ధంగా ఉన్నామని ఈ సందర్భంగా అధికారులు సీఎస్‌కు వివరించారు. హైదరాబాద్ మెట్రో మొదటి, రెండో దశల్లో చేపట్టిన పనుల పురోగతిని మెట్రో రైల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్ సీఎస్‌కు తెలియజేశారు.ఈ సమావేశం అనంతరం సీఎస్ నగరంలో క్షేత్రస్థాయి పర్యటన చేపట్టారు. బేగంపేట నుంచి ప్యారడైజ్ వరకు మెట్రోలో ప్రయాణించి, స్టేషన్లలోని వాణిజ్య సముదాయాలు, పార్కింగ్ వసతులను పరిశీలించారు. హైదరాబాద్ పాతబస్తీలో 7.5 కిలోమీటర్ల మెట్రో కారిడార్ విస్తరణ పనుల పురోగతిని సమీక్షించి, వాటిని మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం ఎన్‌హెచ్-44పై ప్యారడైజ్ జంక్షన్ నుంచి డెయిరీ ఫామ్ రోడ్ వరకు నిర్మిస్తున్న 5.40 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్ పనులను కూడా ఆయన పరిశీలించారు.ఈ ప్రాజెక్టుల అమలులో ఎదురవుతున్న భూసేకరణ, బేగంపేట విమానాశ్రయం వద్ద సొరంగం నిర్మాణ అనుమతులు, రక్షణ శాఖ భూముల సేకరణ వంటి పెండింగ్ అంశాలపై అధికారులతో చర్చించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ప్రాజెక్టులకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంజయ్ జాజు స్పష్టం చేశారు.

# ఢిల్లీలో కుప్పకూలిన పీజీ హాస్టల్ భవనం

## ఐదుగురు మృతి..

## శిథిలాల కింద 50 మంది!

న్యూఢిల్లీ,,ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 7:

దేశ రాజధాని ఢిల్లీలో ఐదు అంతస్తుల పీజీ హాస్టల్ భవనం కుప్పకూలి ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో నలుగురి పరిస్థితి విషమంగా ఉందని, పలువురు శిథిలాల కింద చిక్కుకొన్నారని తెలిసింది. ఢిల్లీ వర్సిటీకి సమీపంలోని 50 ఏండ్లనాటి ఈ భవనంలో గురుగ్రామ్‌కు చెందిన ఓ వ్యక్తి పీజీ హాస్టల్ నడుపుతున్నాడని, భవనం కుప్పకూలిన సమయంలో దాని లోపల దాదాపు 50 మంది ఉన్నారని, ఇందులో చాలామంది విద్యార్థులేనని ప్రత్యక్ష సాక్షులు చెప్పడంతో..ఘటన తీవ్రతపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతున్నది.శిథిలాల కింద చిక్కుకున్న 8 మందిని రెస్క్యూ బృందాలు బయటకు తీసుకొచ్చాయి. ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం రేఖా గుప్తా, సహాయక చర్యలు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయని అన్నారు. కొంతమంది విద్యార్థులు లోపలి నుంచి ఫోన్‌కాల్స్ చేస్తున్నారని, వారంతా లోపల చిక్కుకున్నారని స్థానిక బీజేపీ ఎమ్మెల్యే అనిల్ శర్మ ఆందోళన వ్యక్తం చేశారు.భవనం కూలడానికి అవినీతే కారణమని ఆప్ నాయకుడు సౌరభ్ భరద్వాజ్ ఆరోపించారు. 'ఆర్కే పురం సత్య నికేతన్‌లోని భవనం మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో హఠాత్తుగా కుప్పకూలింది. ఇది 40-50 ఏండ్ల క్రితం నాటి భవనం. బేస్‌మెంట్‌లో మరమ్మత్తులు జరుగుతుండగా ఈ ఘటన చోటుచేసుకున్నది' అని పోలీసులు తెలిపారు.



# కాంగ్రెస్ పార్టీలో కలకలం..

## మాజీ ఎమ్మెల్యే సహా 18 మందికి నోటీసులు

**తెలంగాణ కాంగ్రెస్‌లో 18 మంది నేతలకు షోకాజ్ నోటీసులు**

**పార్టీ సమావేశాల్లో గొడవలపై టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చర్యలు**

**మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి సహా పలువురు ముఖ్య నేతలకు నోటీసులు**

**వారం రోజుల్లోగా వివరణ ఇవ్వాలని కమిటీ ఆదేశం**

,ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 7

తెలంగాణ కాంగ్రెస్‌లో క్రమశిక్షణ ఉల్లంఘనలకు పాల్పడిన నేతలపై పార్టీ అధిష్ఠానం కఠిన చర్యలకు సిద్ధమైంది. పార్టీ ప్రయోజనాలకు విఘాతం కలిగించేలా వ్యవహరించిన 18 మంది నాయకులకు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఆదివారం గాంధీభవన్‌లో కమిటీ చైర్మన్ మల్లు రవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకున్నారు. నోటీసులు అందుకున్న నేతలు వారం రోజుల్లోగా తమ వివరణ సమర్పించాలని కమిటీ ఆదేశించింది.ఆదిలాబాద్, గజ్వేల్, సిరిసిల్ల, కరీంనగర్ నియోజకవర్గాల్లో ఇటీవల పార్టీ అంతర్గత సమావేశాల్లో జరిగిన వివాదాలు, ఇతర అవాంఛనీయ ఘటనలపై అందిన ఫిర్యాదులను కమిటీ క్షుణ్ణంగా పరిశీలించి ఈ చర్యలు చేపట్టింది. నోటీసులు అందుకున్న వారిలో గజ్వేల్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, జూపల్లి మల్లారెడ్డి వంటి కీలక నేతలు ఉన్నారు. వీరితో పాటు ఆదిలాబాద్ జిల్లాకు చెందిన కంది శ్రీనివాస్ రెడ్డి, సంజీవరెడ్డిలకు కూడా నోటీసులు జారీ అయ్యాయి. పెద్దపల్లి ఎంపీ వంశీ కారుపై జరిగిన దాడి ఘటనకు సంబంధించి ఆరుగురిపై, సిరిసిల్ల డీసీసీ అధ్యక్షుడు సింగితం శ్రీనివాస్ అందజేసిన ఫిర్యాదు మేరకు మరో ఏడుగురిపై క్రమశిక్షణ చర్యలకు ఉపక్రమించారు. కరీంనగర్‌కు చెందిన మూల లక్ష్మికి కూడా నోటీసు జారీ చేశారు. ఈ సందర్భంగా మల్లు రవి మాట్లాడుతూ.. పార్టీ నియమావళిని తాను ఎన్నడూ ఉల్లంఘించలేదని, ఎవరిపైనా కక్ష సాధింపు ధోరణితో నివేదికలు ఇవ్వలేదని స్పష్టం చేశారు. కేవలం పార్టీలో క్రమశిక్షణను కాపాడటంలో భాగంగానే ఈ నోటీసులు జారీ చేసినట్లు ఆయన వివరించారు.



# తెలంగాణలో మళ్లీ వర్షాలు.. 20 జిల్లాలకు అలర్ట్ జారీ

**తెలంగాణలో మళ్లీ ప్రారంభమైన వర్షాలు**

**రాష్ట్రంలోని 20 జిల్లాలకు వాతావరణ శాఖ హెచ్చరిక**

**హైదరాబాద్ సహా 6 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ**

**గంటకు 30-40 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం**

,ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 7

తెలంగాణలో వర్షాలు మళ్లీ పుంజుకున్నాయి. గత రెండు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తుండటంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఈ నేపథ్యంలో, హైదరాబాద్ వాతావరణ కేంద్రం కీలక ప్రకటన చేస్తూ.. రాజధాని సహా ఆరు జిల్లాలకు 'ఆరెంజ్ అలర్ట్', మరో 14 జిల్లాలకు 'యెల్లో అలర్ట్' జారీ చేసింది.వాతావరణ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం.. మేడ్చల్, నల్లగొండ, రంగారెడ్డి, సంగారెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అదేవిధంగా ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురుస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇక రాజధాని హైదరాబాద్‌లో మోస్తరు వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు.రాష్ట్రంలోని మిగిలిన జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తన ప్రకటనలో పేర్కొంది.